క్లుప్తంగా

సాగునీటి సమాచారం

దుగ్గిరాల(తాడేపల్లి రూరల్): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద శనివారం 2423 క్యూసెక్కులు విడుదల చేశారు. హై లెవల్ కాలువకు 137 క్యూసెక్కులు, బ్యాంక్ కెనాల్‌కు 190 క్యూసెక్కులు, తూర్పు కెనాల్‌కు 218 క్యూసెక్కులు, పశ్చిమ కెనాల్‌కు 12 క్యూసెక్కులు, నిజాంపట్నం కాలువకు 206 క్యూసెక్కులు, కొమ్మమూరు కాల్వకు 1179 క్యూసెక్కులు విడుదల చేశారు.

నులకపేటలో ఉచిత వైద్యశిబిరం

తాడేపల్లి రూరల్: నగరపాలక సంస్థ పరిధిలోని నులకపేట శివకేశవ నగర్‌లోని చైతన్య తపోవన్ రజతోత్సవాల సందర్భంగా మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించారు. విజయవాడలోని ఎంజే నాయుడు సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో మూడు వేల మందికి పైగా పరీక్షలు చేశారు. కార్యక్రమంలో హాస్పిటల్ చైర్మన్ వావిలాల రజనీకాంత్ శర్మ, వైద్యులు డాక్టర్ రవితేజ, డాక్టర్ వంశీకృష్ణ, డాక్టర్ మణికుమార్, డాక్టర్ సందీప్, డాక్టర్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

వైభవంగా రుద్రేశ్వరస్వామి కల్యాణం

మంగళగిరి: నగర పరిధిలోని వడ్డేశ్వరంలోని గంగా భ్రమరాంబ సమేత రుద్రేశ్వరస్వామి కల్యాణం శనివారం వైభవంగా నిర్వహించారు. కైంకర్యపరులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రేపు సచివాలయ కన్వీనర్లు, గృహసారథుల ఆత్మీయ సమావేశం

మంగళగిరి: గ్రామ సచివాలయ కన్వీనర్లు, గృహ సారథుల ఆత్మీయ సమావేశం సోమవారం నిర్వహించనున్నట్లు పట్టణ, రూరల్ కోఆర్డినేటర్లు మునగాల మల్లేశ్వరరావు, అన్నపురెడ్డి బ్రహ్మారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని ఈద్గా కమ్యూనిటీ హాల్ ఆవరణలో నిర్వహించనున్న సమావేశానికి అందరూ హాజరు కావాలని కోరారు.

సిమెంట్ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

తాడికొండ: మండల కేంద్రమైన తాడికొండలో మండల పరిషత్ నిధులు రూ.8 లక్షలతో నిర్మించనున్న సిమెంట్ రోడ్డు, డ్రెయిన్ల నిర్మాణానికి సర్పంచి తోకల సరోజినీ శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్థానిక సంస్థల నిధులతో గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన శరవేగంగా కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచి ఉయ్యూరు వెంకటరెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి మల్లంపాటి రాఘవరెడ్డి, జిల్లా ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శి తోకల నరసింహారావు, ఎంపీటీసీలు పాలడుగు దేవదాసు, నాయకులు షేక్ మొహిద్దీన్, జర్జిష్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో ప్రసాదాల పంపిణీ

వెల్లటూరు(భట్టిప్రోలు): మండలంలోని వెల్లటూరు వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో కోటిపల్లిలో కొలువైన శ్రీ సత్యజ్ఞాన ప్రసూనాంబ సహిత సోమశేఖరస్వామి దేవాలయంలో మహా శివరాత్రి సందర్భంగా శనివారం భక్తులకు తీర్థ ప్రసాదాలు, పులిహోర, తాగునీరు పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా రీజియన్ చైర్మన్ సీహెచ్. రామ్మోహన్‌రావు పాల్గొన్నారు. టీమ్ డిస్ట్రిక్ట్ సెక్రటరీ, ప్రోగ్రాం ఆఫీసర్స్ నంబూరు నాగభూషణరావు, గోలి చంద్రయ్య, నంబూరి తేజ, వెల్లటూరు వాసవీ క్లబ్ అధ్యక్షుడు నాగళ్ల ఆంజనేయులు, నిర్వాహకులు పాల్గొన్నారు.

కోడి పందేల శిబిరంపై పోలీసుల దాడి

కొల్లూరు: కోడి పందేల శిబిరంపై శనివారం పోలీసులు దాడులు చేసి ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. గాజుల్లంక నుంచి పోతార్లంక మార్గం వెంబడి కోడి పందేలు నిర్వహిస్తున్నట్లు అందిన సమాచారంతో ఏఎస్ఐ కొండవీటి బాబూరావు సిబ్బందితో దాడులు చేశారు. ఏడుగురితో పాటు రెండు కోళ్లు, రూ. 3 వేలను స్వాధీనం చేసుకున్నారు. నిందితుల్ని తెనాలి కోర్టుకు హాజరుపర్చనున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

ఆటల పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులు

రేపల్లె రూరల్: చైల్డ్ రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్ క్రాఫ్ ఆధ్వర్యంలో శనివారం మండలంలోని పిరాట్లంక జెడ్పీ హైస్కూలు ఆవరణలో కల్చరల్ అండ్ లిటరరీ కాంపిటేషన్ ఫర్ చిల్డ్రన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బాలలకు లెవన్ అండ్ స్నూప్స్, పిరమిడ్ గ్లాస్పెస్, బకెట్ ఇన్ ది బాల్, ఐడెంటీ ది నంబర్స్, బొమ్మలను గుర్తించటం తదితర ఆటల పోటీల్ని నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో చైల్డ్ అడ్వకసీ ఫౌండేషన్ క్రాఫ్ ప్రోగ్రాం మేనేజర్ ఎన్. శ్రీనివాసరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీ సందర్శించిన పీడీ

పెనుమర్రు(వేమూరు): మండలంలోని పెనుమర్రు గ్రామంలో జగనన్న కాలనీ శనివారం బాపట్ల జిల్లా గృహ నిర్మాణం ప్రాజెక్ట్ అధికారి ప్రసాద్ సందర్శించారు. అనంతరం లబ్ధిదారుల సమావేశంలో మాట్లాడారు. ప్రతి ఒక్కరూ ఇళ్ల నిర్మాణం చేపట్టాలని ఆయన కోరారు.

శివాలయాల్లో భక్తుల పూజలు



స్వామిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉండవల్లి శ్రీదేవి, జెడ్పీటీసీ కందుల సిద్దయ్య, ఎంపీపీ మన్నవ స్వప్నరాజేష్



స్వామి వారిని దర్శించుకునేందుకు క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులు



వేమవరంలోని మరకతలింగానికి పూజలు చేస్తున్న భక్తులు



స్వామిని దర్శించుకునేందుకు వెళుతున్న భక్తులు

ఫిరంగిపురం: మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లోని శివాలయాల్లో మహా శివరాత్రిని పురస్కరించుకొని శనివారం అర్చకులు విశేష పూజలు చేశారు. వేములూరిపాడులోని జలపాలేశ్వరస్వామికి అర్చకులు ఉమాపతిశాస్త్రి నమకచమకాలతో అభిషేకాలు నిర్వహించారు. ఫిరంగిపురంలోని జెండా చెట్టు వద్ద ఉన్న కాళహస్తీశ్వరస్వామికి అర్చకులు ఆంజనేయశర్మ, పూర్ణచంద్రశాస్త్రి మహాన్యాసపూర్వకంగా విశేష అభిషేకాలు చేశారు. రామాలయంలోని నగరేశ్వరస్వామికి అర్చకులు రాజేంద్రశర్మ 26రకాల వనమూలిక ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించి విశేషపూజలు చేశారు. గొల్లపాలెంలోని గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామికి నుదురుపాడులోని కాశీవిశ్వేశ్వరస్వామి అర్చకులు ఆంజనేయశాస్త్రి అభిషేకాలు నిర్వహించారు. వేమవరంలోని మహాకాళేశ్వర కోటిలింగేశ్వరస్వామికి విశేష అభిషేకాలు అర్చనలు నిర్వహించారు. మరకతలింగానికి భక్తులు అభిషేకాలు చేసేలా ఏర్పాటు చేశారు. 113 తాళ్లూరులోని విశ్వేశ్వరస్వామికి, తక్కెళ్లపాడులోని దుర్గా మల్లేశ్వర స్వామివార్లకు అర్చకులు మహన్యాసపూర్వక అభిషేకాలు నిర్వహించి భక్తుల గోత్రనామాలతో పూజలు చేసి తీర్థప్రసాదాలు అందజేశారు.

నవగ్రహాలకు పూజలు: పలు ఆలయంలోని నవగ్రహాలకు శనిత్రయోదశిని పురస్కరించుకొని భక్తులు నువ్వులనూనెతో అభిషేకాలు చేసి నల్లవస్త్రాలు సమర్పించారు.

శివాలయానికి పోటెత్తిన భక్త జన సందోహం

మంగళగిరి: మహాశివరాత్రిని పురస్కరించుకుని శనివారం నగరంలోని గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి దేవస్థానం(శివాలయం) భక్తులు పోటెత్తారు. తెల్లవారుజామున మూడు గంటల నుంచే భక్తులు భారీగా తరలివచ్చి స్వామికి ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ ఈఓ ఎ.రామకోటిరెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేయగా పోలీసులు బందో బస్తు ఏర్పాటు చేశారు.

శివనామస్మరణతో మార్మోగిన కైలాసగిరి

మేడికొండూరు: మండలంలోని పేరేచర్లలోని కైలాసగిరి క్షేత్రం శివరాత్రి సందర్భంగా భక్తులు తరలివచ్చారు. దీనిలో భాగంగా మహిళలు, భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. మెట్ల మార్గం ద్వారా కొండపైకి చేరుకున్న భక్తులు భజనలు చేశారు. తాడికొండ ఎమ్మెల్యే డాక్టర్ ఉండవల్లి శ్రీదేవి, వైఎస్సార్ సీపీ జిల్లా పార్టీ అధ్యక్షుడు డొక్కా మాణిక్యవరప్రసాద్ స్వామిని దర్శించుకున్నారు. విద్యుత్ ప్రభ ఆకట్టుకుంది. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు కందుల సిద్దయ్య, ఎంపీపీ మన్నవ రాజేష్ స్వప్న, ఆలయ కమిటీ సభ్యులు కారుమూరి వెంకటేశ్వరరావు, కారుమూరి సాంబశివరావు, కారుమూరి శ్రీనివాసరావు, శ్రీకాకుళం లక్ష్మీనారాయణ, పెనుగొండ వీరాంజనేయులు, ఉషకుమార్, పి.శివ ప్రసాద్ పాల్గొన్నారు.

తాళ్లాయపాలెం శైవక్షేత్రంలో మంత్రి ఉషశ్రీ చరణ్ పూజలు

తాడికొండ: రాష్ట్ర మంత్రి ఉష శ్రీ చరణ్‌తో కలిసి తుళ్ళూరు మండలం తాళ్ళాయపాలెం శైవక్షేత్రంలో ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి శివలింగాన్ని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహా శివరాత్రిని పురస్కరించుకొని నియోజకవర్గంలోని పలు గ్రామాల్లోని శివాలయాల్లో ఎమ్మెల్యే శ్రీదేవి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం గుంటూరులోని దేవాపురం ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వ విద్యాలయంలో జెండా వందనం చేసి వేడుకలు నిర్వహించారు. అనంతరం మేడికొండూరు మండలం పేరేచర్ల శైవక్షేత్రంలో శివలింగానికి ప్రత్యేక పూజలు నిర్వహించి వేద పండితుల ఆశీర్వచనాలు అందుకొని భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. మహా శివరాత్రిని పురస్కరించుకొని తాడికొండ మండలం బడేపురం గ్రామంలోని భవానీ పీఠంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు.



మంత్రి ఉషశ్రీ చరణ్‌తో కలిసి తాళ్ళాయపాలెం శైవక్షేత్రంలో ఎమ్మెల్యే డాక్టర్ ఉండవల్లి శ్రీదేవి


నేడు ఘంటసాల సంగీత విభావరి

తెనాలి: గంధర్వ గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు వర్ధంతి సందర్భంగా పట్టణానికి చెందిన భారతీయ సాహితీ సంస్కృత వేదిక శ్రీ కళారంజని ఆధ్వర్యంలో ఆదివారం సంగీత విభావరిని నిర్వహించనున్నారు. కవిరాజ పార్కులోని వీజీకే భవన్‌లో సాయంత్రం 5 గంటలకు ప్రారంభమవుతుంది. అపర ఘంటసాలగా పేరొందిన వై.ఆర్. శాస్త్రి తన గానకళా కౌశలంతో ప్రేక్షకులను రంజింపజేస్తారని అధ్యక్షురాలు డాక్టర్ కేఎస్ఎల్ పద్మావతీదేవి, కార్యదర్శి గోనుగుంట్ల మురళీకృష్ణ తెలియజేశారు.

హాస్టల్ నిర్వాహకురాలి ఆత్మహత్య

పట్నంబజారు: హాస్టల్ నిర్వాహకురాలు ఆత్మహత్యకు పాల్పడిన ఘటనపై శనివారం కేసు నమోదయింది. అరండల్‌పేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బాపట్ల జిల్లా మార్టూరు మండలంలోని బేగర్లపూడి గ్రామానికి చెందిన చల్లగుండ్ల స్రవంతి (35)కి ఇరవై ఏళ్ల క్రితం అశోక్ అనే వ్యక్తితో వివాహం అయ్యింది. వీరు బ్రాడీపేట 1, 4 లైనుల్లో దివ్యశ్రీ బాయ్స్ హాస్టల్ నిర్వహిస్తున్నారు. హాస్టల్ సరిగా నడవక పోవటం, అప్పులు అధికమైపోవటం, అద్దెలు కూడా చెల్లించలేని పరిస్థితులు ఏర్పడటంతో నిత్యం స్రవంతి బాధపడుతూ ఉండేది. ఈ క్రమంలో స్నేహితురాలికి ఫోన్ చేసి తన పిల్లలను జాగ్రత్తగా చూసుకోవాలని కోరింది. బ్రాడీపేట 1వ లైనులోని హాస్టల్ గదిలో చీరతో ఫ్యాన్‌కు ఉరి వేసుకుంది. మృతురాలి తల్లి జంపాని శివపార్వతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

నిర్విఘ్నంగా అఖండ నాదోపాసన




నాదోపాసనలో డాక్టర్ లోకనాథశర్మ

తెనాలి: మహా శివరాత్రి సందర్భంగా స్థానిక రామలింగేశ్వరపేటలోని శ్రీగంగాపార్వతీ సమేత శ్రీరామేశ్వరస్వామి దేవస్థానంలో విశ్వశాంతి, లోకకళ్యాణార్థం అఖండ నాదోపాసన మహాయజ్ఞం నిర్విఘ్నంగా జరిగింది. పట్టణానికి చెందిన ప్రఖ్యాత సంగీత విద్వాంసుడు 'కలైమామణి' డాక్టర్ తాడేపల్లి లోకనాథశర్మ ఈ యజ్ఞాన్ని చేపట్టిన సంగతి తెలిసిందే. ఆలయ ప్రాంగణంలోని లలితా ధామంలో ఉదయం 8 గంటలకు ఆలయ కార్యనిర్వహణాధికారి శ్రీనివాస రెడ్డి, బ్రాహ్మణ పరిషత్, తెనాలి ప్రధాన కార్యదర్శి పోతావఝల పురుషోత్తమశర్మ విద్వాంసుడు డాక్టర్ తాడేపల్లి లోకనాథశర్మకు పుష్పమాల వేసి, కార్యక్రమాన్ని ప్రారంభించారు. అప్పట్నుంచి రాత్రి ఏడు గంటల వరకు 11 గంటలపాటు ఏకధాటిగా నాదోపాసన కొనసాగింది. 79 ఏళ్ల వయసులో సంగీతాన్ని ఒక తపస్సులా భావిస్తూ, నాదోపాసన యజ్ఞాన్ని ప్రతి విపత్తులోనూ చేపడుతున్న లోకనాథశర్మను దేవాలయానికి వచ్చిన భక్తులు అభినందించారు.



విద్యుత్ వెలుగుల్లో గొడవర్రు గ్రామ ప్రభ






నారాకోడూరుకు చెందిన మిత్ర మండలి, గ్రామ ప్రభలు



గుండవరం గ్రామ ప్రభ



శలపాడుకు చెందిన విద్యుత్ ప్రభ

క్వారీలో ప్రభ వెలుగులు

చేబ్రోలు: మహాశివరాత్రి సందర్భంగా వడ్లమూడి క్వారీ తిరునాళ్లలో శనివారం రాత్రి భారీ విద్యుత్ ప్రభలు కాంతులు వెలుగులు నింపాయి. జిల్లాలో కోటప్పకొండ తరువాత పేరొందిన చేబ్రోలు మండలం వడ్లమూడి క్వారీ తిరునాళ్లకు ఈ ఏడాది 12 భారీ విద్యుత్ ప్రభలు తరలివచ్చాయి. నారాకోడూరు నుంచి 4, చేబ్రోలు, గొడవర్రు, గుండవరం, వడ్లమూడి, శేకూరు, శలపాడు, సుద్దపల్లి గ్రామాల నుంచి విద్యుత్ ప్రభలు వచ్చాయి. వివిధ రకాల విద్యుత్ బల్బులతో ఆకర్షణీయంగా విద్యుత్ ప్రభలను తీర్చిదిద్దారు. బాలకోటేశ్వరస్వామి దేవస్థానం ప్రాంగణం వద్ద నారాకోడూరు యాదవ సమాజానికి చెందిన వారు 111 అడుగుల ఎత్తు భారీ విద్యుత్ ప్రభ ఏర్పాటు చేశారు. గుండవరం, గొడవర్రు గ్రామ ప్రభలు విద్యుత్ వెలుగులతో ఆయా గ్రామాల నుంచి ఆలయానికి చేరుకున్నాయి. నారాకోడూరు మీదుగా వడ్లమూడి క్వారీ దేవాలయం వరకు వెళ్లే మార్గాల వద్ద ట్రాఫిక్ అంతరాయం కలగకుండా పోలీసులు జాగ్రత్తలు తీసుకున్నారు. చేబ్రోలు, నారాకోడూరు, వడ్లమూడి ప్రాంతాల్లో పోలీసు చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.



క్వారీ దేవాలయం ప్రాంగణం వద్ద నారాకోడూరు యాదవ సమాజం వంద అడుగుల భారీ విద్యుత్ ప్రభ

అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

ఎమ్మెల్యే ఆర్కే

మంగళగిరి: నగరపాలక సంస్థ పరిధిలో కోట్లాది రూపాయల నిధులతో చేపట్టిన పలు అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) సూచించారు. నగరంలో విస్తృతంగా పర్యటించి పలు అభివృద్ధి పనులను శనివారం పరిశీలించారు. నగరంలోని పాత బస్టాండ్ సెంటర్ ప్రగడ కోటయ్య ప్రాంగణంలో డాక్టర్ వైఎస్సార్ చేనేత భవన్ నిర్మాణ పనులను, జగనన్న కాలనీ (టిడ్కో గృహ సముదాయం) వద్ద సుమారు రూ.7 కోట్లతో చేపట్టిన విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణాన్ని పనులను పరిశీలించారు. ఏప్రిల్ మొదటి వారానికి సబ్ స్టేషన్ నిర్మాణం పూర్తి చేయాలన్నారు. అనంతరం నగరంలోని తెనాలి రోడ్డు గుంటూరు చానల్ వెంబడి రక్షిత తాగునీటి పథకం వద్ద ఇండోర్ స్విమ్మింగ్ పూల్, స్కేటింగ్ రింక్ నిర్మాణ పనులను, శుద్ధి చేయబడిన నీటిని పంపింగ్ చేసే కృష్ణా వాటర్ పంప్‌హౌస్ నిర్మాణ పనులను, పరిశీలించారు. ఆయా కార్యక్రమాల్లో పట్టణ పార్టీ కన్వీనర్ మునగాల మల్లేశ్వరరావు, పార్టీ నాయకులు సంకా బాలాజీ గుప్తా, డీఈ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని పెద్ద కోనేరు (కల్యాణ పుష్కరిణి)లో ఇటీవల బయట పడిన పవిత్ర శివలింగాలకు ఎమ్మెల్యే ఆర్కే ప్రత్యేక పూజలు నిర్వహించారు.



చేనేత భవన్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే)

నేచర్ ఇండెక్స్‌లో ఏపీ ఎస్ఆర్ఎం ప్రతిభ

- దేశంలోని ప్రైవేటు వర్సిటీల్లో 3వ స్థానం
- ప్రతిష్టాత్మక నేచర్ ఇండెక్స్‌లో 45వ ర్యాంక్

మంగళగిరి: ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీకి అంతర్జాతీయ స్థాయిలో పేరున్న నేచర్ ఇండెక్స్ ర్యాంకింగ్స్‌లో 45వ స్థానం లభించింది. ఇండియాలో పేరున్న పలు విశ్వవిద్యాలయాలు, ఐఐటీలు, ఎన్ఐటీలు, జాతీయ పరిశోధనా సంస్థల నుంచి ప్రఖ్యాత జర్నల్స్‌లో ప్రచురితమైన పరిశోధనా పత్రాలను పరిగణనలోకి తీసుకుని నేచర్ ఇండెక్స్ తాజాగా ర్యాంకులను ప్రకటించింది. ఇందులో ఓవరాల్‌గా 45వ ర్యాంకును దక్కించుకున్న ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీ ప్రైవేటు యూనివర్సిటీల ర్యాంకింగ్స్‌లో 4.16 వాటాతో 3వ స్థానాన్ని దక్కించుకుంది. ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో ప్రొఫెసర్లుగా పని చేస్తున్న ప్రొఫెసర్ రంజిత్ థాపా(ఫిజిక్స్), డాక్టర్ షోజీ, డాక్టర్ మహేశ్ రవ్వా (కెమిస్ట్రీ), డాక్టర్ అమిత్ చక్రవర్తి(ఫిజిక్స్), డాక్టర్ పంకజ్ భల్లా(ఫిజిక్స్), డాక్టర్ నిమై మిశ్రా(కెమిస్ట్రీ)లకు చెందిన 11 పరిశోధనా పత్రాలు ప్రపంచ ప్రాముఖ్యత సంతరించుకున్న జర్నల్స్ ప్రచురితమయ్యాయి. ఈ పరిశోధనా పత్రాలన్నీ లైఫ్ సైన్స్, ఫిజికల్ సైన్స్, కెమికల్, ఎర్త్ సైన్స్‌లకు సంబంధించినవి. మొత్తం 82 జర్నల్స్ క్రోడీకరించి అందులో విశిష్టమైన పరిశోధనా పత్రాలను ఎంపిక చేశారు. అమెరికా కేంద్రంగా వివిధ యూనివర్సిటీల పరిశోధనలు ప్రొఫెసర్ల పరిశోధనా పత్రాలు, వాటిలోని సైంటిఫిక్ విలువలను గుర్తించి ఏటా నేచర్ ఇండెక్స్ ర్యాంకులను కేటాయిస్తుంది. ఈ నేపథ్యంలో ఈసారి ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీకి ఇండియాలోని ప్రైవేటు యూనివర్సిటీల్లో 3వ స్థానం లభించడం విశేషం. ఇండియాలోని గుర్తింపు కలిగిన పలు యూనివర్సిటీలు, ఐఐటీలకు లభించని ఉత్తమ ర్యాంకులు ఏపీ ఎస్ఆర్ఎంకు లభించడం అభినందనీయమని యూనివర్సిటీ ప్రొ వైస్ చాన్సలర్ ఆచార్య డి.నారాయణరావు పేర్కొన్నారు. ఈ సందర్భంగా పరిశోధనా పత్రాలను పంపిన ప్రొఫెసర్లు, రీసెర్చ్ స్కాలర్లకు ఏపీ ఎస్ఆర్ఎం విశ్వ విద్యాలయం ప్రెసిడెంట్ డాక్టర్ సత్యనారాయణన్, వైస్ చాన్సలర్ ఆచార్య మనోజ్ కుమార్ అరోరాలు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఇది ఏపీ ఎస్ఆర్ఎంకు దక్కిన అరుదైన గౌరవమని అభిప్రాయపడ్డారు. రానున్న రోజుల్లో ఏపీ ఎస్ఆర్ఎం వర్సిటీ మొదటి స్థానంలో నిలిచేలా కృషి చేయాలని ప్రెసిడెంట్ డాక్టర్ సత్యనారాయణన్ కోరారు.

రంగస్థల నటుడు ఉమామహేశ్వరరావుకు సన్మానం

తెనాలి అర్బన్: ప్రముఖ సినీ నటుడు నందమూరి తారక రామారావు శత జయంతి ఉత్సవాలలో భాగంగా శనివారం కొత్తపేటలోని పెన్షనర్స్ హాలులో చర్చను నిర్వహించారు. ఎన్టీఆర్ రంగస్థల జీవితంపై పోలవరపు జనార్దనరావు, వెలగా సుభాష్ చంద్రబోసు ప్రసంగించారు. అనంతరం వారితో పాటు ప్రముఖ పౌరాణిక రంగస్థల కళాకారుడు అమ్మిశెట్టి ఉమామహేశ్వరరావును కమిటీ సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు, తాడిబోయిన హరిప్రసాద్, కానుమాను కనక రాంబాబు, ఈదర వెంకట పూర్ణచంద్, అత్తోట శరత్‌బాబు, కంచర్ల ఏడుకొండలు పాల్గొన్నారు.



ఇళ్ల నిర్మాణాలపై లబ్ధిదారులు దృష్టి సారించాలి

కొల్లూరు : జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలపై లబ్ధిదారులు దృష్టి సారించాలని తహసీల్దార్ ఎ. శ్రీనివాసరావు, ఎంపీడీఓ ఐ. సత్యనారాయణరావు చెప్పారు. కొల్లూరు జగనన్న కాలనీలో శనివారం లబ్ధిదారులు, గ్రామ వలంటీర్లకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణాలకు ప్రభుత్వం అందజేస్తున్న రూ. 1.80 లక్షలకు తోడు డ్వాక్రా సంఘాల సభ్యులకు అదనంగా మరో రూ. 50 వేలు రుణం అందిస్తున్నట్లు చెప్పారు. దశల వారీగా ప్రభుత్వం నుంచి అందే నగదు, నిర్మాణానికి అవసరమైన సామగ్రి పంపిణీ గురించి వలంటీర్లు కూడా అవగాహన కల్పించాలని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మురాల రాంబాబు, ఈఓ బి. మల్లికార్జున పాల్గొన్నారు.

హరహర మహాదేవ...

పెదకాకాని: పెదకాకాని శివక్షేత్రం మహా శివరాత్రి కల్యాణ బ్రహ్మోత్సవాల సందర్భంగా శనివారం ఓం నమఃశివాయ నామంతో మార్మోగింది. రాష్ట్ర నలుమూలల నుంచి వేలాదిగా తరలివచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. భక్తులందరికీ స్వామి దర్శనం కలిగేలా ఆలయ సహాయ కమిషనర్ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి నేతృత్వంలో ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు. ఆలయం చుట్టూ శివ నామం స్మరిస్తూ ప్రదక్షిణలు చేసిన భక్తులు భ్రమరాంబ మల్లేశ్వరస్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారు అన్నపూర్ణాదేవిగా భక్తులను దర్శనమిచ్చారు. ఆలయ ప్రాంగణం క్యూలైన్లు భక్తులతో కిక్కిరిసిపోయింది. మహా శివరాత్రి పర్వదినం పురస్కరించుకుని ఆలయ ప్రాంగణమంతటా శోభయమానంగా అలంకరించారు. ఒక్కరోజులో స్వామివారికి వివిధ సేవా కార్యక్రమాల ద్వారా 9,13,508 రూపాయలు ఆదాయం చేకూరినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఆలయ ప్రాంగణం విద్యుత్ కాంతులతో కళకళలాడుతుంది. మహా శివరాత్రి పర్వదినం పురస్కరించుకుని ఆలయానికి తరలివచ్చిన వేలాది మంది భక్తులకు పెదకాకాని వర్తక సంక్షేమసంఘం, శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ ధర్మకర్త ఆదినేని అంకబాబు, శివాలయం మాజీ ట్రస్టుబోర్డు సభ్యులు పెండెం విజయ్, దూపాటి వెంకట్రావుల ఆధ్వర్యంలో ఉచితంగా అన్నప్రసాద వితరణ చేశారు. అలానే కాకతీయ యూత్, ఆర్యవైశ్యసంఘం, ఆర్యవైశ్యయూత్‌ల ఆధ్వర్యంలో పులిహోర, పొంగలి, దద్ధోజనము ఉదయం నుండి రాత్రి వరకూ ఉచిత ప్రసాద పంపిణీ చేశారు. దాతల సహకారంతో క్యూలైన్లలో చిన్న పిల్లలకు పాలు, మజ్జిగ, వాటర్ ప్యాకెట్లు పంపిణీ చేశారు.



పెదకాకాని శివాలయంలో అన్నపూర్ణాదేవిగా భ్రమరాంబ అమ్మవారు

ప్రముఖుల రాక

మహా శివరాత్రి కల్యాణ బ్రహోత్సవాలను పురస్కరించుకుని ఆలయానికి హైకోర్టు న్యాయమూర్తి సుజాత, స్థానిక ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య, జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి దంపతులు, జేసీ జి.రాజకుమారి, విశ్రాంత న్యాయమూర్తి సత్యనారాయణ దంపతులు, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, సీనియర్ ఐపీఎస్ అధికారి ఎస్.అమ్మిరెడ్డి తదితరులు శివాలయానికి విచ్చేశారు. ప్రముఖులకు ఏసీ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. భ్రమరాంబ అమ్మవారిని మల్లేశ్వర స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలల్లో పాల్గొన్నారు. అర్చకులు, వేదపండితులు వేద ఆశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రంతో ఘనంగా సత్కరించి ప్రసాదాలు అందజేశారు.

పేదలకు అల్పాహారం పంపిణీ

తెనాలి అర్బన్: మహా శివరాత్రి పురస్కరించుకుని వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ నేత పెసర్లంక రమణ ఆధ్వర్యంలో శివాలయం వద్ద ఉన్న యాచకులు, పేదలకు శనివారం అల్పాహారాన్ని పంపిణీ చేశారు. వైఎస్సార్ సీపీ నేత తట్టుకుళ్ల అశోక్ యాదవ్ పాల్గొన్నారు.